
రంజాన్ వేళలు

	ఇఫ్తార్(శుక్రవారం)	సెహార్(శనివారం)
కర్నూలు	6:36 (సాయంత్రం)	4:47 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:35 (సాయంత్రం)	4:41 (ఉదయం)
ఆదోని	6:38 (సాయంత్రం)	4:46 (ఉదయం)

సూర్య ప్రతాపం



ఎండలు మండిపోతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా నిప్పుల కుంపటిలా మారుతోంది. ఎప్పుడూ లేని విధంగా దేశంలోనే రికార్డుస్థాయిలో ఉమ్మడి జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలతో అన్ని మండలాలు భగభగ మండిపోతున్నాయి. ఉదయం ఏడు గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఎండలకు తోడు వేడిగాలులు వీయడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉక్కబోతతో ఆపసోపాలు పడుతున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళ పనులు ముగించుకుంటున్నారు. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. నెలాఖరు లోపు ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరే అవకాశాలున్నాయి. దీంతో ప్రజలు ఇప్పటి నుంచే భయాందోళనకు గురవుతున్నారు. నెలాఖరు వచ్చేసరికి ఎండలు మరింత తీవ్రస్థాయిలో ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది. దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన మన రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాగా కర్నూలు, నంద్యాల ముందు వరుసలో ఉన్నాయి. ఉక్కపోత జనాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.



నిత్యం రద్దీగా ఉండే రాజ్‌విహార్ సర్కిల్ మధ్యాహ్నం వేళ ఇలా..





- రారెత్తిస్తున్న ఎండలు
- నిప్పుల కొలిమిలా కర్నూలు జిల్లా
- భయపెడుతున్న వడగాల్పులు
- అత్యధిక ఉష్ణోగ్రతలు కర్నూలులోనే నమోదు
- మరిన్ని రోజులు ఇలాగే : వాతావరణ శాఖ
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



భయపెట్టే ఎండలు... అయినా తప్పదు ప్రయాణం

కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 4: జిల్లాలోని పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలతో ప్రజలకు దిమ్మతిరుగుతోంది. రాష్ట్రంలోని ఉమ్మడి కర్నూలు జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. వడగాలులు వీస్తుండటంతో ప్రజలు బయటకు వెళ్లాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకునే పరిస్థితి ఏర్పడింది. గురువారం దేశ వ్యాప్తంగా నమోదైన ఉష్ణోగ్రతల్లో కర్నూలు, నంద్యాల టాప్‌లో నిలిచాయి. సాధారణం కంటే ఒకటి నుంచి 3 డిగ్రీల మేర అధికంగా పగటి ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. దేశంలో అత్యధికంగా నమోదైన ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాల్లో ఏపీ అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, పశ్చిమబెంగాల్‌లో నిలిచాయి. ఈ జాబితాలో కర్నూలు టాప్‌లో ఉంది. కర్నూలులో రికార్డయిన ఉష్ణోగ్రత 43.2 డిగ్రీలు కాగా.. సాధారణం కంటే ఇది 3 డిగ్రీలు అదనం. రెండో స్థానంలో నంద్యాల నిలిచింది. ఇక్కడ 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాధారణం కంటే 2 డిగ్రీలు ఎక్కువ. అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన జిల్లాలో అనంతపురం మూడో స్థానానికి చేరింది. ఇక్కడ 42.4 డిగ్రీల టెంపరేచర్ రికార్డయింది.

ఈ వేసవిలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఎండల మంటలే ఉంటాయని ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని అధికార వర్గాలు హెచ్చరిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు రాజకీయ నాయకులు ఇప్పటికే ప్రజలను కలిసేందుకు వీధుల్లో ప్రచారాన్ని మొదలు పెట్టారు. ఎండవేడిమిని వారు తట్టుకోలేక తెల్లవారుజామున, మరోవైపు రాత్రి 6 గంటల సమయంలో తమ ప్రచారాలను మొదలెట్టారు. ఒక పక్క ఎన్నికల హీట్.. మరో పక్క మండుటెండలు వారిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. దీంతో ఈ ఏడాది సాధారణ ఎన్నికల వేడికి సమానంగా ఎండలు సమానంగా ఉన్నాయి.

భయపెడుతున్న ఎండలు..!

ఎల్‌నినో ప్రభావంతోనే దేశంలో మండిపోతున్నాయని.. వాతావరణ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. గత నెల రెండో వారం నుంచే ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఈ ఎండల తీవ్రత ఎక్కువగా నమోదవుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇప్పటికే 40 నుంచి 42 డిగ్రీల వరకు నమోదు కావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎల్‌నినో బలహీనపడుతున్నా ఇప్పటి నుంచి జూన్ వరకు ఉష్ణోగ్రతలు ఏ మాత్రం తగ్గే పరిస్థితులు కనిపించడం లేదు. మరోవైపు మూడు నెలలు ఎండల తీవ్రతతో పాటు వడగాల్పులు ఎక్కువగా వీచే ప్రమాదం నెలకొని ఉంది. ఈ క్రమంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బందులు తప్పవని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించండి

ఉమ్మడి జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు దేశంలోనే అత్యధికంగా నమోదవుతుండటంతో ప్రజలు ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు, వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎండలు తగ్గేవరకు రక్షణ చర్యలు పాటించాలని సూచిస్తున్నారు.

- అత్యవసరమైతే తప్ప.. బయటకు వెళ్లరాదు.
- తప్పనిసరిగా టోపీలు, గొడుగులు, టవళ్లు వినియోగించాలి.
- సిల్కు, కాటన్ వస్త్రాలు కాకుండా నూలు వస్త్రాలను ధరించాలి. అదేవిధంగా లేతరంగుల పలుచటి కాటన్ వస్త్రాలు ధరిస్తే మంచిది.
- మంచినీరు, నిమ్మరసం, కొబ్బరినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి తాగుతూ ఉండాలి.
- ఈ ఎండల కారణంగా అధిక శ్రమతో పని చేయరాదు. ముఖ్యంగా ఉపాధి కూలీలు అధిక శ్రమతో కూడిన పనులు ఎండలో చేయరాదు. పని చేసేవారు ఇబ్బందిగా ఉంటే చల్లని ప్రదేశంలో సేద తీరాలి.
- అధిక వేడి వల్ల ఆహారం త్వరగా పాడైపోతుంది. అలాంటివి తింటే డయేరియాసోకే ప్రమాదం ఉందని, తాజా ఆహారం తినాలని డాక్టర్లు చెబుతున్నారు.

వారం రోజులుగా కర్నూలు నగరంలో ఉష్ణోగ్రతలు ఇలా

తేదీ	ఉష్ణోగ్రతలు
ఏప్రిల్ 4	43.2
ఏప్రిల్ 3	42.7
ఏప్రిల్ 2	42.5
ఏప్రిల్ 1	40.2
మార్చి 31	41.0
మార్చి 30	41.5
మార్చి 29	42.3



అప్రమత్తంగా ఉండాలి..



ఎండల తీవ్రత పెరుగుతోంది.. రాబోయే రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువవుతాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండల్లో తిరగరాదు. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కళ్లు తిరగడం, నీరసం, తలనొప్పి, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే తప్పక వైద్యులను సంప్రదించాలి. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలపై టోపిని పెట్టుకోవాలి. కిడ్నీ, గుండె రోగులు జాగ్రత్తగా ఉండాలి.

-డాక్టర్ మీనుగ శ్రీనివాసులు,
జనరల్ మెడిసిన్ అసిస్టెంట్, కర్నూలు జీజీహెచ్





డాడీ త్వరగా వెళ్లు..



నిర్మానుష్యంగా జిల్లా పరిషత్ రూట్



ఎంత వేగంగా వెళ్లినా సూర్య తాపాన్ని తప్పించుకోలేరు







గొడుగు, కుండ తప్పనిసరి.. ఈ ఎండలకు



గుడ్ ఐడియా.. ఎండ నుంచి రక్షణగా బైక్‌పై ఇలా

40 మంది పీఓ, ఏపీఓలకు షోకాజ్ నోటీసులు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 4: సాధారణ ఎన్నికల్లో భాగంగా రెండు రోజులు పాటు నిర్వహించిన శిక్షణ తరగతులకు హాజరుకాని 40 మంది పీఓ, ఏపీఓలకు షోకాజ్ నోటీసులు అందజేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఏ. భార్గవతేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1, 3వ తేదీల్లో సుంకేసుల రోడ్డులోని ఎమ్మార్సీ ఫంక్షన్ హాలులో జరిగిన శిక్షణ తరగతులకు వివిధ ప్రభుత్వ శాఖల నుంచి 40 మంది పీఓలు, ఏపీఓలు హాజరుకాలేదు. గైర్హాజరుపై కలెక్టర్ జి. సృజన తీవ్రంగా స్పందించారు. వెంటనే గైర్హాజరైన 40 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పింఛన్ల పంపిణీ వంద శాతం పూర్తి చేయండి



కలెక్టర్ జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 4: జిల్లాలో సామాజిక పింఛన్లను వందశాతం పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ జి. సృజన అధికారులను ఆదేశించారు. గురువారం పింఛన్ల పంపిణీ, ఉపాధి హామీ పనుల అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ ఉదయం 8 గంటల నాటికి 48 శాతం పింఛన్లు పంపిణీ చేశామన్నారు. 40 శాతం కంటే తక్కువ పంపిణీ చేసిన పెద్దకడుబూరు, కృష్ణగిరి, నందవరం, మద్దికెర, వెల్దుర్తి, సి.బెళగల్ తదితర మండలాల ఎంపీడీవోలను ప్రశ్నించారు. విభిన్న ప్రతిభావంతులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, అస్వస్థతతో ఉన్నవారు మంచానికే పరిమితమైన వారు, నడవలేక వీల్ ఛైర్స్‌లో ఉన్నవారు, సైనిక్ సంక్షేమ పింఛన్ పొందుతున్న వృద్ధ మహిళలకు ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలన్నారు. సచివాలయాల్లో నీడ, నీటి వసతి ఉండేలా చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో రేపటి నుంచి ఉగాది ఉత్సవాలు

- నేటితో ముగియనున్న మల్లన్న స్పర్శదర్శనం
- ఉత్సవాల్లో అలంకార దర్శనం మాత్రమే

శ్రీశైలం, ఏప్రిల్ 4: శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం నుంచి ఉగాది మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఐదురోజులపాటు జరిగే ఈ మహోత్సవాలు 6న స్వామివారి యాగశాల ప్రవేశంతో ప్రారంభమై 10న ముగియనున్నాయి. ఉత్సవాల సందర్భంగా జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జునస్వామికి విశేష అర్చనలు, మహాశక్తి స్వరూపిణి భ్రమరాంబికాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, స్వామి, అమ్మవార్లకు వివిధ వాహన సేవలు, 8వ తేదీన ప్రభోత్సవం, వీరాచార విన్యాసాలు, ఉగాదిరోజు 9న ఉదయం పంచాగ్రశ్రవణం, పండిత సత్కారం, సాయంకాలం రథోత్సవం జరపనున్నారు. ఉత్సవాల సందర్భంగా దేవస్థానం భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉగాది ఉత్సవాల నేపథ్యంలో శుక్రవారం మాత్రమే స్పర్శదర్శనాన్ని కల్పిస్తారు. రేపటి నుంచి కేవలం అలంకార దర్శనం మాత్రమే ఉంటుందని ఆలయ వర్గాలు వెల్లడించాయి. ఉత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, హహారాష్ట్ర ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి తరలివస్తున్నారు. గురువారం శ్రీశైలంలో కన్నడ భక్తుల రద్దీతో క్షేత్రవీధులన్నీ నిండుగా దర్శనమిచ్చాయి. భక్తుల సౌకర్యార్థం పాదయాత్ర మార్గంలో, క్షేత్ర పరిధిలో కన్నడ భక్తబృందాలు, స్వచ్ఛందసేవా సంస్థలు అన్నదాన శిబిరాలను నిర్వహిస్తున్నాయి.

మల్లన్న వాహనసేవలు ఇలా...

- 6న భృంగివాహన సేవ, మహాలక్ష్మీ అలంకారం
- 7న కైలాసవాహన సేవ, మహాదుర్గ అలంకారం
- 8న నందివాహన సేవ, మహాసరస్వతి అలంకారం, ప్రభోత్సవం, వీరాచార విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం
- 9న పంచాగ్రశ్రవణం, రథోత్సవం, అమ్మవారికి రాజరాజేశ్వరి అలంకారం
- 10న అశ్వవాహనసేవ, భ్రమరాంబాదేవి నిజఅలంకరణ.

జేఈఈ-మెయిన్స్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 4: దేశంలో ప్రఖ్యాతిగాంచిన విద్యాసంస్థల్లో బీటెక్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ-మెయిన్స్ ఫేజ్-2 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహించింది. ఆన్‌లైన్ పరీక్షలు ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతాయి. కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని పట్టణాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జేఈఈ-మెయిన్స్ పేపర్-1 బీఈ, బీటెక్, బీఆర్క్ ఆన్‌లైన్ పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు సెషన్ల చొప్పున జరుగుతున్నాయి. ఉదయం 8 గంటలకే అభ్యర్థులు వారి తల్లిదండ్రులు, బంధువులతో పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. కర్నూలు సనత్‌నగర్‌లోని ఐయాన్ డిజిటల్ సెంటర్ కేంద్రంలో మధ్యాహ్నం 12 గంటలకు పరీక్ష పూర్తయినప్పటికీ 30 నిమిషాల అనంతరం కూడా సెంటర్ల నుంచి అభ్యర్థులను బయటకు పంపలేదు. మొత్తం మీద మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

గెలుపే మన లక్ష్యం

ఎన్‌డీఏ పక్షాల సమన్వయ కమిటీ నాయకులు



టీడీపీ కార్యాలయంలో భేటీ అయిన ఎన్‌డీఏ పక్షాల సమన్వయ కమిటీ నాయకులు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 4: టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేద్దామని ఎన్‌డీఏ పక్షాల సమన్వయ కమిటీ పిలుపు ఇచ్చింది. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి పక్షాల ఆధ్యక్షులు బీటీ నాయుడు, కునిగిరి నీలకంఠం, సి. సురేష్ బాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయడానికి ఉమ్మడి కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గ్రామ, మండల, నియోజవర్గం స్థాయిల్లో ఉన్న 3 పార్టీల కేడర్‌ను ఎన్నికల్లోపు కలిసి పని చేయించేందుకు నిర్దిష్ట కార్యక్రమం రూపొందిండం అత్యవసరం అన్నారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించేందుకు వార్డు స్థాయిలో కూడా కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి రోజు ప్రజలతో మమేకమయ్యేలా కార్యాచరణ ఉండాలని వారు అన్నారు. ఎన్‌డీఏ పక్షాలపై వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని, టీడీపీ మిత్రపక్షాలు అధికారంలోకి రాగానే ఇంటింటికి వెళ్లి పింఛన్ అందజేస్తామని ప్రచారం చేయాలని అన్నారు. స్థానిక నాయకుల వల్ల ఏవైనా సమస్యలుంటే ఎప్పకప్పుడు పార్టీల అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు కేఈ జగదీష్, డి. జేమ్స్, ఎస్. ముంతాజ్, బీజేపీ నాయకులు ఉపేంద్ర కుమార్, సాయి ప్రదీప్, సూర్యకుమార్, శ్రీనివాసులు, రేఖ, మల్లన్న, హర్షాద్, రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

టికెట్ తమకే అని కొండంత ఆశతో ఉన్నవారికి నిరాశ ఎదురైంది. టీడీపీ అధి నాయకత్వం వేరే వాళ్లకు ఇచ్చింది. పొత్తులో ఒప్పందాలు, సామాజిక సమీకరణాలు కలిసి కొందరు ఆశావహులను పక్కన పెట్టింది. దీంతో అసంతృప్తి చెందిన నాయకులను బుజ్జగించి అభ్యర్థులను గెలిపించాలని సూచిస్తూ పార్టీ నాయకుడు చంద్రబాబునాయుడు ఒక బృందాన్ని పంపించారు. వాళ్లు అసంతృప్తితో ఉన్న నాయకులను కలిసి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు.

బుజ్జగింపుల పర్వం

- టికెట్ రాని నాయకులను కలిసిన టీడీపీ బృందం
- సర్దుబాటు ప్రయత్నాలు షురూ
- ఒకట్రెండు రోజుల్లో అన్ని సర్దుకుంటాయి - బీటీ నాయుడు

● మంత్రాలయం టీడీపీ టికెట్ ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి పి. తిక్కారెడ్డి ఆశించారు. ఈయనతో పాటు టీడీపీ సీనియర్ నాయకుడు ఉలిగయ్య కూడా ప్రయత్నించారు. సామాజిక సమీకరణల్లో భాగంగా బోయ (వాల్మీకి) సామాజికవర్గానికి చెందిన మాధవరం ఎస్. రాఘవేంద్రరెడ్డిని బరిలో దింపారు.

● ఆదోని టికెట్ టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె. మీనాక్షినాయుడు, మార్కెట్ యార్డు చైర్మన్ మదిరె భాస్కరరెడ్డి, ఏపీ ఫుడ్ కమిషన్ మాజీ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ సహా పలువురు నాయకులు ఆశించారు. పొత్తుల్లో భాగంగా బీజేపీ కేటాయించడంతో ఆ పార్టీ బోయ (వాల్మీకి) సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ పీవీ పార్థసారథికి టికెట్ ఇచ్చింది.

● కోడుమూరు (ఎస్సీ) టీడీపీ టికెట్ తనకే వస్తుందని ఆ పార్టీ ఇన్‌చార్జి ఆకేపోగు ప్రభాకర్ గట్టి నమ్మకంతో ఉంటూ వచ్చారు. ఆయనకు ఒక కీలక నాయకుడి మద్దతు కూడా ఉంది. రాజకీయ మార్పుల దృష్ట్యా అధినేత చంద్రబాబు బొగ్గుల దస్తగిరిని అభ్యర్థిగా తొలి జాబితాలోనే ప్రకటించారు.

● ఆలూరు టీడీపీ టికెట్ తనకే వస్తుందని ఆ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ధీమాగా ఉంటూ వచ్చారు. మాజీ ఇన్‌చార్జిలు వైకుంఠం మల్లికార్జున, వైకుంఠం ప్రసాద్ సతీమణి జ్యోతి కూడా తీవ్రంగా ప్రయత్నం చేశారు. రాజకీయ, సామాజిక సమీకరణాలు దృష్ట్యా వీర శైవ లింగాయత్ సామాజికవర్గానికి చెందిన బి. వీరభద్ర గౌడ్‌ను అభ్యర్థిగా నాలుగో విడతలో అధిష్ఠానం ప్రకటించింది.

కర్నూలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలు పార్లమెంట్ పరిధిలో టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు టికెట్ల కేటాయించిన పద్ధతి వల్ల టికెట్ దక్కిన వారికి ఆనందం.. రాని వారిలో నిరాశ నిస్పృహలు నెలకొన్నాయి. టికెట్లు కేటాయించడానికి వివిధ సర్వేలు, రాజకీయ, సామాజిక సమీకరణాలు, పొత్తులు పని చేశాయని చెప్పవచ్చు. అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు, అక్రమ కేసులు ఎదురొడ్డి పోరాడితే చివరి క్షణంలో అన్యాయం చేశారంటూ ఇన్‌చార్జిలు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఒకరిద్దరు రెబల్‌గా మారడమా..? అనే డైలమాలో పడ్డారు. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు అధి నాయకత్వం శ్రీకారం చుట్టింది. ఆదివారం ఎమ్మిగనూరులో అధినేత చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం జన వెల్లువై విజయగళంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేస్తే నష్టపోయే ప్రమాదం ఉందని గ్రహించిన అధిష్ఠానం అసంతృప్తులకు గురైనవారిని బుజ్జగించే పని చేపట్టింది. అందులో భాగంగానే జిల్లాలో అధిష్ఠానం పంపించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు నేతృత్వంలో జోన్-5 ఇన్‌చార్జి బీదా రవిచంద్రయాదవ్, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, కడప జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి బృందం బుజ్జగింపులు ప్రారంభించారు.

● అధిష్ఠానం దూతలుగా..

టీడీపీ అధి నాయకత్వం పంపిన బృందం ఆదోని నియోజకవర్గం టికెట్ రాక నిరాశతో ఉన్న ఆ పార్టీ ఇన్‌చార్జి కె.మీనాక్షినాయుడు సహా గుడిసె కృష్ణమ్మ, మదిరె భాస్కరరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎలాంటి పరిస్థితుల్లో ఆదోని టికెట్ బీజేపీకి ఇవ్వాల్సి వచ్చిందో వివరించారు. పొత్తు ధర్మం పాటిస్తూ బీజేపీ అభ్యర్థి డాక్టర్ పీవీ పార్థసారథి గెలుపు కోసం పని చేయాలని, ఇది అధిష్ఠానం సందేశం అని స్పష్టత ఇచ్చారు. అదే క్రమంలో వారి ఆవేదనను కూడా ఆలకించారు. మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పి.తిక్కారెడ్డి, ఆయన వర్గీయులతో మంత్రాలయంలో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. రాయలసీమలో వాల్మీకులు అధికంగా ఉండడం వల్లే ఆ సామాజిక వర్గానికి చెందిన రాఘవేంద్రరెడ్డికి టికెట్ ఇవ్వాల్సి వచ్చిందని ఆ బృందం వారికి చెప్పింది. అయితే.. టికెట్ విషయంలో పునరాలోచించి తిక్కారెడ్డికే ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేశారు. వాల్మీకులకే ఇవ్వాల్సి వస్తే పార్టీ కోసం కొన్నేళ్లుగా పని చేస్తున్న అదే సామాజిక వర్గానికి చెందిన ఉలిగయ్య, బసలదొడ్డి ఈరన్న, కోసిగి వక్రాణి వెంకటేశ్, మాధవరం అమర్నాథ్‌రెడ్డి ఉన్నారు కదా అని ప్రశ్నించినట్లు తెలిసింది. కోడుమూరు (ఎస్సీ) టికెట్ ఆశించి భంగపడిన ఆ పార్టీ ఇన్‌చార్జి ఆకేపోగు ప్రభాకర్, కోడుమూరు మండల కన్వీనర్ కోట్ల కవితమ్మలతో ప్రత్యేక బృందం సమావేశం అయ్యింది. ఇక్కడ కూడా అభ్యర్థి విషయంలో పునరాలోచన చేయాలని కోట్ల వర్గం చెప్పినట్లు సమాచారం. ఆలూరు టీడీపీ ఆశించి నిరాశ నిస్పృహలతో ఉన్న పార్టీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ, వైకుంఠం మల్లికార్జున, వైకుంఠం జ్యోతిలతో పాటు వారి వర్గీయులతో భేటీ అయి బుజ్జగించినట్లు సమాచారం. అసంతృప్తితో ఉన్న నాయకులు అభిప్రాయాలను టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని, నాయకులందరూ కలిసి కూటమి అభ్యర్థుల విజయానికి పని చేయాలని పార్టీ జోన్-5 ఇన్‌చార్జి బీదా రవిచంద్రయాదవ్ వెల్లడించినట్లు తెలుస్తోంది.

వ్యూహాత్మక అడుగులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు, నంద్యాల ఎంపీ స్థానాలు సహా 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 2004కు ముందు టీడీపీకి కంచుకోట. ఆ తర్వాత రాజకీయ పరిణామాలు కారణంగా టీడీపీ సీట్లు తగ్గుతూ వచ్చాయి. 2014 ఎన్నికల్లో ఎమ్మిగనూరు, పత్తికొండ, బనగానపల్లె మాత్రమే విజయం సాధించింది. 2019లో ఒక్క ఎమ్మెల్యే కూడా గెలవలేదు. ఎలాగైనా కర్నూల్లో పూర్వవైభవం తీసుకొచ్చి కొండారెడ్డి బురుజుపై పసుపు జెండా ఎగురవేయాలనే లక్ష్యంగా టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఏడాదిన్నర క్రితం నిర్వహించిన బాదుడే బాదుడు సభలకు జనం పోటెత్తి నిఘా వర్గాలకే అంతుచిక్కని స్థాయిలో సక్సెస్ కావడంతో రాష్ట్రంలోనే టీడీపీకి జోష్ పెంచింది. యువనేత నారా లోకేశ్ పాదయాత్ర సూపర్ డూపర్ సక్సెస్ అయ్యింది. గత నెల 29న సీఎం జగన్ ఎమ్మిగనూరులో మేము సిద్ధం సభకు ఉమ్మడి జిల్లాలో వివిధ గ్రామాలకు 1,400 ఆర్టీసీ బస్సులు పంపి జనసమీకరణ చేస్తే.. జగన్ ప్రసంగిస్తుండగా జనం లేక సభా ప్రాంగణం వెలవెలబోయింది. ఒక్క రోజు తేడాతో 31న టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి నేతృత్వంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు తేరుబజారులో నిర్వహించిన ప్రజాగళం సభకు ఒక్క ఆర్టీసీ బస్సు పంపకపోయినా ఎమ్మిగనూరు నుంచి వెల్లువలా జనం తరలి వచ్చారు. తేరుబజారు, పురవీధులు జనం వరదలా కనిపించాయి. ప్రజల్లో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను ఓటుగా మార్చుకొని రెండు పార్లమెంట్ స్థానాలు సహా 8-10 స్థానాలకు తగ్గకుండా ఎమ్మెల్యేలు గెలవాలనే వ్యూహాలకు పదును పెట్టారు. అందులో భాగంగానే టికెట్ ఆశించిన నిరాశ చెందుతున్న అసంతృప్తిదారులను బుజ్జగించేందుకు చంద్రబాబు ప్రత్యేక బృందాన్ని పంపిచారని అంటున్నారు. అవసరం అయితే అధినేత చంద్రబాబు కూడా వారిని పిలిపించి మాట్లాడే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు.



మంత్రాలయంలో టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి వర్గం సమావేశంలో మాట్లాడుతున్న బీటీ నాయుడు

ఒకట్రెండు రోజుల్లో అన్నీ సర్దుకుంటాయి

కర్నూలు పార్లమెంట్ పరిధిలో ఆదోని, కోడుమూరు, మంత్రాలయం, ఆలూరు పార్టీ ఇన్‌చార్జిలు టికెట్లు ఆశించారు. రాజకీయ, సామాజిక సమీకరణాలు వల్ల అధిష్ఠానం టికెట్లు ఇవ్వలేకపోయింది. నిరాశతో ఉన్న ఆశావహులను కలసి పార్టీ విజయం కోసం పని చేసేలా ఒప్పించమని మా బృందాన్ని పంపిన మాట నిజమే. ఆయా నియోజకవర్గాల నాయకులతో మాట్లాడాం. వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలను కూడా అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాం. రెండు మూరు రోజుల్లో అంతా సర్దుకుంటుంది. సమన్వయంతో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం నాయకులంతా పని చేస్తారని ఆశిస్తున్నాం.

- బీటీ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు



ఆదోనిలో మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు వర్గంతో టీడీపీ కమిటీ నాయకులు

శ్రద్ధగా చదివితే జీవితంలో రాణిస్తారు

● ఆర్‌యూ రీజనల్ స్థాయి పోటీల్లో ఉప కులపతి

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 4: చదువులో శ్రద్ధ ఉన్నప్పుడే జీవితంలో విజయం సాధిస్తారని ఉపకులపతి టీ. సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలో సెనేట్ హాల్లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి క్విజ్ చాంపియన్ షిప్పు-2024 రీజనల్ క్వాలిఫైర్స్ రౌండును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా వివిధ విషయాల పట్ల అవగాహన పెంచుకోవాలని అన్నారు. అందులో భాగంగానే విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు ఇలాంటి క్విజ్ పోటీలకు ఉన్నత విద్యామండలి రూపకల్పన చేసి ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నదని అన్నారు. ఈ ఏడాది రీజనల్ స్థాయి పోటీల నిర్వహణను రాయలసీమ యూనివర్సిటీకి అప్పగించిందని తెలిపారు. ఈ పోటీల్లో రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లా నుంచి 14 కళాశాలల బృందాలు హాజరయ్యాయని తెలిపారు. అందులో కర్నూలు సెయింట్ జోసెఫ్ కళాశాల, జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల. జి. పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల, అనంతపురం జేఎన్‌టీయూ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. త్వరలో విజయవాడలో జరిగే సెమి ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించాయన్నారు. విజేతలకు రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ ఎన్. అంకన్న ధృవపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి అకడమిక్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎస్, చంద్రమెహన్‌రెడ్డి, ప్రొఫెసర్లు సీవీ కృష్ణారెడ్డి, వై. హరిప్రసాద్‌రెడ్డి, సుందరానంద పుచ్చా, విశ్వనాథరెడ్డి, భరత్ కుమార్, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.



క్విజ్ విజేతలకు ప్రశంసా ప్రతాలను అందజేస్తున్న ఆర్‌యూ ఉపకులపతి

28న ఏపీ సెట్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 4: ఏపీ సెట్ పరీక్షలు 28న నిర్వహిస్తున్నట్లు రీజనల్ కోఆర్డినేటర్, రాయలసీమ యూనివర్సిటీ రెక్టార్, ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ తెలిపారు. గురువారం పరీక్షల నిర్వహణకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పరీక్షలకు సంబంధించిన 9 సెంటర్లు ఏర్పాటు చేశామని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించి పరీక్ష కేంద్రాలు కేటాయించామని పేర్కొన్నారు.

టీజీవీ కళాక్షేత్రం నాటకానికి 'నందిని' అవార్డులు



జ్ఞాపిక అందుకుంటున్న టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 4: తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా, మిర్యాలగూడలో, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి 'నందిని' నాటకోత్సవాల్లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులకు అవార్డుల పంట పండింది. గురువారం రాత్రి ఈ అవార్డులను ప్రకటించి, కళాకారులను అందజేశారు. గత వారం రోజులుగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన నాటక సమాజాలు ఈ ప్రదర్శనల్లో పోటీ పడగా, టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం' నాటకం జాతీయ స్థాయి పద్య నాటక విభాగంలో ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా ఎంపికైంది. అలాగే ఈ నాటకంలో నటించిన కళాకారులకు వ్యక్తిగత విభాగంలో 6 నందిని బహుమతులు సొంతం చేసుకున్నారు. ఉత్తమ ద్వితీయ నాటకంగా నాటక దర్శకుడు పత్తి ఓబులయ్య అవార్డు అందుకోగా, వ్యక్తిగత అవార్డులను వరుసగా ఉత్తమ నటుడు జీవీ శ్రీనివాసరెడ్డి, ఉత్తమ నటి సురభి ప్రభావతి, ఉత్తమ సహాయ నటుడు పి. రాజారత్నం, ఉత్తమ సహాయ నటి హసీనా, ఉత్తమ ఆహార్యం (మేకప్) చింతా శ్రీనివాసులు, ఉత్తమ రచన పల్లేటి కులశేఖర్ అందుకున్నారు. పౌరాణిక పద్య నాటకాల్లో ఏడు అవార్డులు సాధించిన టీజీవీ కళాక్షేత్రం కళాకారులను విశ్రాంత కలెక్టర్ గుమ్మళ్ల బలరామయ్య అభినందించారు.

లోక్ అదాలత్ న్యాయాధికారి బదిలీ

కర్నూలు(లీగల్), ఏప్రిల్ 4: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం రాత్రి 39 మంది సీనియర్ సివిల్ న్యాయాధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మూడు సంవత్సరాలుగా ఆయన కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. దీంతో సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన గుంటూరు జిల్లా సత్తెనపల్లి కోర్టుకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో గుంటూరు జిల్లా గురజాలలో పని చేస్తున్న బి.లీలా వెంకటశేషాద్రిని నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఖాళీగా ఉన్న ఆదోని సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా విజయనగరం జిల్లా పార్వతీపురంలో పని చేస్తున్న యజ్ఞ నారాయణను నియమించింది.

వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుకకు ఎదురు దెబ్బ

- రూ.360 కోట్లు అప్పు చెల్లించలేదని స్థిరాస్తుల అమ్మకానికి ఈ-వేలం
- పబ్లిక్ నోటీస్ జారీ చేసిన ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్



కర్నూలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుకకు ఎన్నికల సమయంలో ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ భారీ షాక్ ఇచ్చింది. బుట్టా రేణుక, ఆమె భర్త బీఎస్ నీలకంఠ పేరిట తీసుకున్న అప్పు రూ.360 కోట్లు చెల్లించకపోవడంతో.. ష్యూరిటీగా పెట్టిన 15 స్థిరాస్తులను అమ్మకం కోసం బెంగళూరుకు చెందిన ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ ఈ-వేలం అమ్మకం ప్రకటన జారీ చేసింది. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఏ ఇద్దరు కలసినా దీనిపైనే ప్రధానంగా చర్చించుకోడం కొసమెరుపు. ఈ నెల 29న వైసీపీ అధినేత, సీఎం జగన్ ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ మైదానంలో నిర్వహించిన మేము సిద్ధం సభలో కర్నూలు పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల వైసీపీ అభ్యర్థులను పరిచయం చేశారు. 'ఈ నియోజకవర్గానికి (ఎమ్మిగనూరు) చెందిన బుట్టమ్మ నా చెల్లెలు సౌమ్యురాలు.. బీసీ కులానికి చెందిన నా చెల్లెమ్మ.. ఆర్థికంగా కూడా మాత్రం అంతంత మాత్రంగానే ఉంది.' అంటూ పేదరాలిగా పరిచయం చేసే ప్రయత్నం చేశారు సీఎం జగన్. గతంలో బుట్టా రేణుక, ఆమె కుమారుడు ఓ యూట్యూబ్ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన ఆస్తుల వివరాలు, సీఎం జగన్ మాటలు జోడించి సోషల్ మీడియాలో తెగ ట్రోలింగ్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా బుట్టా రేణుకకు ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ భారీ షాక్ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా (హైదరాబాద్)లో బుట్టా రేణుక, ఆమె భర్త బీఎస్ నీలకంఠ పేరిట ఉన్న వివిధ స్థిరాస్తులను తాకట్టు పెట్టి 1995 నుంచి 2012 వరకు పలు దఫాలుగా ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో అప్పులు తీసుకున్నారు. తీసుకున్న అప్పు వడ్డీతో సహా రూ.360 కోట్లు చెల్లించాలని 2019 నవంబరు 18న డిమాండ్ నోటీస్ జారీ చేసినట్లు ఆ సంస్థ ఇచ్చిన ప్రకటనలో వెల్లడించింది. తెలంగాణ రాజధాని హైదరాబాదులో ఓ ప్రధాన పత్రికలో ఎల్ఐసీ హెచ్ఎఫ్‌సీ బెంగళూరు మేనేజరు గురువారం ఈ-వేలం అమ్మకం ప్రకటన ఇచ్చింది. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయంగా చర్చనీయాంశంమైంది. రూ.360 కోట్లు ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీ హెచ్ఎఫ్‌సీకి చెల్లించాల్సిన బుట్టా రేణుక ఆర్థికంగా కూడా అంతంత మాత్రంగానే ఉందంటూ.. ఆమెను ఓ పేదరాలిగా సీఎం జగన్ నమ్మించే ప్రయత్నం చేయడం రాజకీయ నాయకులకు చెల్లు అంటూ పట్టణ ప్రజలు చర్చించుకోవడం కొసమెరుపు. ఈ విషయంపై ఎమ్మిగనూరు వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక వివరణ కోసం ఫోన్లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

అన్ని స్థానాల్లో టీడీపీని గెలిపిద్దాం

కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 4: కర్నూలు పార్లమెంట్ స్థానంతో పాటు అన్ని అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను కష్టపడి గెలిపించుకుందామని ఎంపీ అభ్యర్థి బస్తిపాటి కురువ నాగరాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కర్నూలు రూరల్ మండలంలోని పంచలింగాల గ్రామంలో గురువారం సాయంత్రం సర్పంచు గొల్ల మాధవి అధ్యక్షతన పంచలింగాల, దేవమాడ, గొందిపర్ల, ఈ.తాండ్రపాడు గ్రామాల ఆధ్వర్యంలో టీడీపీ ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, బీజేపీ మహిళా నాయకురాలు గీతామాధురిరెడ్డి, జనసేన నాయకులు రాంబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి నాగరాజు మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. సామన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తికి టీడీపీ అధినేత చంద్రబాబు ఎంపీ టికెట్ ఇచ్చి గౌరవించారు. అలాంటి పెద్దాయన మాటను నిలబెట్టాలంటే ఈఎన్నికల్లో మీబిడ్డగా ఆశీర్వదించి చట్టసభలకు పంపాలని కోరారు. ఒక్క చాన్స్‌పేరుతో గద్దె నెక్కిన జగన్ రెడ్డి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నాశనం చేశాడన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబుకు బహుమతిగా అందజేయాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, ఆదాం, వై.కృపాదానం, నాగరాజు. సోమన్న, సత్యంయాదవ్, పంచలింగాల గొల్లకృష్ణ, పంచలింగాల లక్ష్మీకాంతరెడ్డి, జయసింహరెడ్డి వై.సంజీవరావు, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి నాగరాజు, కోడుమూరు అభ్యర్థి బొగ్గుల దస్తగిరి

చెక్ బౌన్స్ కేసులో ప్రభుత్వ ఉద్యోగికి జైలు, జరిమానా

కర్నూలు(లీగల్), ఏప్రిల్ 4: తీసుకున్న రుణానికి హామీగా ఇచ్చిన బ్యాంకు చెక్ బౌన్స్ కావడంతో దాఖలైన కేసులో ఓ ప్రభుత్వ ఉద్యోగికి 3 నెలల కారాగార శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ కర్నూలు మొదటి అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జ్యోష్ణదేవి గురువారం తీర్పునిచ్చారు. కర్నూలు నగరంలో హంద్రీనీవా సుజల స్రవంతి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసే బి.వెంకటరమణయ్య 2016 సంవత్సరంలో అవసరాల కోసం రూ.3 లక్షలను అప్పుగా ఫిర్యాది విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి అయిన బీవీ వెంకట్రాముడు నుంచి అప్పు తీసుకున్నాడు. ఆ తర్వాత తీసుకున్న రుణానికి హామీగా మూడు ప్రామిసరి నోట్లను రాసిచ్చాడు. ఆ తర్వాత 2017లో రూ.3లక్షలకు మూడు బ్యాంకు చెక్కులను హామీగా ఫిర్యాదికి ఇచ్చాడు. ఫిర్యాది ఆ చెక్కులను వసూలు కోసం తన బ్యాంకులో దాఖలు చేయగా.. నిందితుడి ఖాతాలో తగిన నిల్వలు లేకపోవడంతో అవి బౌన్స్ అయ్యాయి. దీంతో ఫిర్యాది కోర్టులో కేసు దాఖలు చేశాడు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో మూడు నెలల జైలు, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

మంటలు చెలరేగి బైక్ దగ్ధం

- యువకుడికి గాయాలు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 4: ఎమ్మిగనూరు పట్టణలోని మంత్రాలయం జాతీయ రాహదారి బియ్యం గోడౌన్ వద్ద గురువారం రాత్రి రన్నింగ్‌లో ఉన్న పల్సర్ బైక్‌లో మంటలు చెలరేగి దగ్ధమైంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన వీరేష్ సొంతపని నిమిత్తం పత్తికొండ మండలం సింగారం గ్రామానికి పల్సర్ బైక్‌పై వెళ్లాడు. పని చూసుకొని తిరిగివస్తుండగా పట్టణంలోని మార్కెట్ కమిటీ సర్కిల్ వద్ద ఉన్నట్టుండి బైక్ ఇంజన్ నుంచి మంటలు చెలరేగాయి. వీరేష్ వెంటనే బైక్‌పైనుంచి కిందకు దూకాడు. దీంతో బైక్ కొంత దూరం వెళ్లి రోడ్డుపై పడి మంటల్లో పూర్తిగా దగ్ధమైపోయింది. బైక్‌పై నుంచి దూకిన వీరేష్‌కు తలకు గాయాలయ్యాయి. స్థానికులు అతడ్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



కాలిపోతున్న బైక్

ఉగాదికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

కర్నూలు(రూరల్)ఏప్రిల్4: ఉగాది పర్వదినం పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు కర్నూలు జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీసులు ఈనెల 8నుంచి 10వతేది వరకు కర్నూలు జిల్లాల్లో 5డిపోల నుంచి శ్రీశైలం, ఇతర శైవక్షేత్రాలకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 115 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆయన వివరించారు. రాయచూర్-శ్రీశైలం 10, ఆదోని-శ్రీశైలం 30, ఎమ్మిగనూరు-శ్రీశైలం 25, కర్నూలు-శ్రీశైలం 50 సర్వీసులను కేటాయించినట్లు ఆయన వివరించారు. కాబట్టి భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గంజాయి విక్రేతల అరెస్టు

డోన్(రూరల్), ఏప్రిల్ 4: పట్టణంలోని శ్రీరామనగర్‌కు చెందిన గంజాయి విక్రేతలను పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని శ్రీరామనగర్‌కు చెందిన భరత్‌చంద్ర, బోయ విజయ్ అనే వ్యక్తులు పత్తికొండ ప్రాంతంలో ఓ వ్యక్తి నుంచి 1100 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి డోన్‌లో విక్రయించడానికి సిద్ధం అవుతుండగా.. వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం


మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 4: ఎన్నికల ప్రవర్తనా నియామవళి తదితర అంశాలపై గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ జి.సృజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫార్మ్-6, 8లను ఏప్రిల్ 16 వరకు స్వీకరించి వాటిని ఈనెల 25వ తేదీ నాటికి విడుదల చేస్తామన్నారు. ఎంసీసీకి సంబంధించి ఇప్పటి వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పాటించని 32 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామన్నారు. ఎగ్జిట్ ఓపినీ యన్ పోల్స్ నిర్వహించకూడదన్నారు. ఎపిక్ కార్డులకు సంబంధించి ఇప్పటి వరకు 2,65,000 ప్రింట్ చేశామని, ఇంకా 60 వేలు ప్రింటింగ్‌లో ఉన్నాయని అన్నారు. వీటిలో 2,40,000 పోస్టల్ శాఖ ద్వారా డెలివరి చేశామన్నారు. ప్రింటింగ్‌లో 60వేలు, మిగిలిన 20 వేలు ఎపిక్ కార్డులను కూడా త్వరితగతిన పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఎన్నికల విధులలో ఉన్న వారితోపాటు అత్యవసర సర్వీసులైన 33 శాఖలకు చెందిన వారిని పోస్టల్ బ్యాలెట్ అందజేస్తామన్నారు. ఈవీఎం గోడౌన్‌లో ఏప్రిల్ 12న ఈవీఎం మిషన్ల మొదటి విడత సంబంధించి ర్యాండమైజేషన్ చేస్తామ న్నారు. ఈ సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, వైసీపీ లీగల్‌సెల్ జనరల్ సెక్రటరీ కె.పుల్లారెడ్డి, టీడీపీ ప్రతినిధి చంద్రహాస్, బీజేపీ ప్రతినిధి బి.కోటేశ్వర్లు, సీపీఐ ప్రతినిధి కేవీ నారాయణ, బీఎస్పీ ప్రతినిధి జి.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి: జేసీ


ఓటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కల్లూరు, ఏప్రిల్ 4: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పాణ్యం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సూచించారు. గురువారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా కల్లేరు మండలం ఉలిందకొండ జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి పాత బస్టాండ్ వరకు నిర్వహిం చిన ఓటర్ల అవగాహన ర్యాలీలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పాల్గొ న్నారు. అనంతరం పందిపాడు, లక్ష్మీపురం, పెద్దటేకూరు, కొంగనపాడు గ్రామా ల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటును స్వేచ్ఛగా తమకు నచ్చిన వారికి వేసుకోవచ్చని అన్నారు. ఎన్నికల నియామా వళిని ప్రతిఒక్కరూ పాటించాలని, పాణ్యం నియోజకవర్గంలో ఓటింగ్ శాతాన్ని పెంచేలా బీఎల్‌ఓలు చూడాలని అన్నారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దారు సి.మునిస్వామి, వెలుగు ఏపీవో శ్రీనివాసులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

తాగునీటి పథకాల పరిశీలన

సి.బెళగల్, ఏప్రిల్ 4: మండలంలోని పోలకల్లు, ముడుమాల, ఇనగండ్ల గ్రామాల్లోని తాగునీటి పథకాలను ఎంపీడీవో శకుంతల గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు సూచించారు. అలాగే మండలంలో మొత్తం 7341 మంది పింఛన్‌దారులు ఉన్నారని, ఇప్పటి వరకు గ్రామాల్లో ఇప్పటివరకు 90 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఆర్‌యూలో నెలాఖరుకు వైవా పరీక్షలు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 4: డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్ ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు ఈనెలఖరుకు వైవా పరీక్షలను నిర్వహిస్తామని రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి బీ.సుధీర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. గురువారం ఉపకులపతి చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. డిగ్రీ, 2, 4 సెమి స్టర్లో రెగ్యులర్, సప్లమెంటరీ, 6వ సెమిస్టర్ పరీక్షలను మే మొదటి వారంలో నిర్వహిస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డిగ్రీ, పీజీ కోర్సులకు సంబంధించిన పలు విషయాలపై వర్సిటీ అధికారులతో సమీక్షించారు. ఈసమావేశంలో రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ ఎన్.అంకన్న, ప్రొఫెసర్లు, డీన్‌లు, ప్రిన్సిపాల్స్ పరీక్షల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఏడీగా బాధ్యతల స్వీకరణ

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 4: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత ఏడాది అక్టోబరు 11న ఏడీని అధికారులు సరెండర్ చేశారు. ఆ తర్వాత ఆయన కోర్టుకు వెళ్లారు. ఇంతలో 3 నెలలు సెలవులో వెళ్లారు.. తిరిగి మళ్లీ బాధ్యతలు చేపట్టారు.

టీడీపీ విజయం ఖాయం


విష్ణుని కలిసి మద్దతు తెలుపుతున్న ఆర్.కానాపురం టీడీపీ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 4: కోడుమూరులో టీడీపీ విజయం ఖాయమని మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు అన్నారు. గురువారం మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు ఆధ్వర్యంలో ఆర్ కానాపురం నుంచి టీడీపీ శ్రేణులు కర్నూలులోని జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి నివాసానికి తరలివెళ్ళి కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి విజయానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. టీడీపీ నేత సుమన్ బాబు మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్యంకొండ దస్తగిరి, శ్రీనివాస రెడ్డి, సుభాన్, రామాంజనేయులు, నరసింహులు, ఉరుకుంద పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో ముస్లింల అభివృద్ధి

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 4: టీడీపీ హయాంలో ముస్లింల అభివృద్ధి జరిగిందని కర్నూలు పార్టీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలోని 6వ వార్డులోని గడ్డవీధిలో జనసేన కర్నూలు ఇన్‌చార్జి ఆర్షద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, జనసేన పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్షంఖాన్‌తో కలిసి టీజీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ముస్లింలకు పెద్ద పీట వేసిందన్నారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో మసీదుల అభివృద్ధి కోట్లాది రూపాయలు ఖర్చు చేశామన్నారు. ఈ ఐదేళ్ల పాలనలో మసీదులకు వైసీపీ ఏం చేసిందో


భరోసా యాత్రలో పాల్గొన్న టీజీ భరత్

చెప్పాలన్నారు. 2018లో కర్నూలులో ఇస్తేమా నిర్వహించినప్పుడు రూ.10 కోట్లు టీడీపీ ఇచ్చిందని గుర్తు చేశారు. ముస్లింలకు రంజాన్ తోఫాను ఇచ్చిందన్నారు. ఈ కార్యక్ర మాలన్నీ టీడీపీ, బీజేపీ పొత్తులో ఉన్నప్పుడే జరిగాయని, కేవలం ఎన్నికల ముందుకు బీజేపీతో టీడీపీ పొత్తు ఉండదని, టీడీపీని గెలిపిస్తే ముస్లింలు నష్టపోతారని అసత్య ప్రచారాలు చేసే వైసీపీ నాయకులు వ్యాఖ్యలు నమ్మ వద్దని విజ్ఞప్తి చేశారు. సీఏఏ బిల్లుకు వైసీపీ పార్లమెంట్‌లో మద్దతు తెలప డమే కాకుండా రాష్ట్రంలో నోటిఫికేషన్ సైతం తెచ్చిందన్నారు. మంచి పనులు చేస్తున్న టీడీపీపై నిందలు వేయడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్ బాషా, హమీద్, నాయకులు మహబూబ్ బాషా, ఇబ్రహిం, బూత్ ఇన్‌చార్జిలు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే నగరాభివృద్ధి: తెలుగుదేశం పార్టీతోనే నగరం అభివృద్ధి చెందుతుందని కర్నూలు పార్టీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరం లోని 2 వార్డులోని పాత బస్టాండ్ అంబేడ్కర్ సర్కిల్‌లో నుంచి టీజీ భరత్ భరోసా యాత్ర సుబేదార్ వీధి, లక్ష్మీనారాయణ బుక్, జైన్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో సాగింది. నగరంలో యువతకు అవసరమైన ఉపాధి అవకాశాలకు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించుకున్నానని, అలాగే మహిళలు, కార్మికులు, దుకాణాల్లో పని చేసే కార్మికులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎంత నష్టపో యామో పరిస్థితులు ఒక సారి గుర్తు చేసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వార్డు, బూత్ ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ముస్లింలతో టీజీ భరత్, బస్తిపాటి నాగరాజు

వలంటీర్ వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదు: వలంటీర్ వ్యవస్థకు తెలుగుదేశం పార్టీ వ్యతిరేకం కాదని కర్నూలు పార్టీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే మా ఎన్డీఏ ప్రభుత్వం వలంటీర్లకు న్యాయం చేస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులే పింఛన్లు పంపిణీ చేయాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందన్నారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లు పంపిణీ చేయాలని కోరారు. పేదలు, వృద్ధులు, వికలాంగులకు ఇచ్చే పింఛన్ల విషయంలో రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. 2014లో చంద్రబాబు సీఎం అయిన తర్వాత రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2వేలు పెంచారన్నారు. ఇప్పుడు మళ్లీ తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.4వేలు పింఛన్ ఇస్తారన్నారు. పింఛన్ల పంపిణీలో రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు.

వైసీపీ అరాచక పాలనను అంతం చేద్దాం

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 4: వైసీపీ అనుసరిస్తున్న అరాచక పాలనను సార్వత్రిక ఎన్నికల్లో కలిసి కట్టుగా అంతం చేద్దామని కోడుమూరు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ప్రజలకు పిలుపునిచ్చారు. కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడు గ్రామంలో గురువారం ఇంటింట తిరిగి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఆయన గ్రామంలో ప్రతి వార్డులో పర్యటించి అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచు ఆకెపోగు జయన్న, ఎంపీటీసీ మద్దిలేటి, మాజీ సర్పంచు శ్రీను, మాజీ ఎంపీటీసీ మాదన్న, మాజీ ఉపసర్పంచు చాంద్‌బాషా, పేరపోగు రాజు, గొల్లవెంకటేష్, కిరణ్, వనుములయ్య, ఎల్లకృష్ణ, యేసు, రత్నం కిశోర్, మోహన్, వెంకటేష్, యూసూఫ్, చిన్న పాల్గొన్నారు.


బి.తాండ్రపాడులో ప్రచారం చేస్తున్న బొగ్గుల దస్తగిరి

పెద్దాసుపత్రిలో విచారణ ప్రారంభం


సీఎస్ఆర్ఎంవో చాంబరులో విచారణ చేస్తున్న కమిటీ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 4: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్ ఇన్స్‌పెక్టర్‌పై పెస్ట్ కంట్రోల్ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదుపై గురువారం ఉదయం సీఎస్ ఆర్ఎంవో చాంబర్‌లో విచారణ ప్రారంభమైంది. ఆసుపత్రి సూపరిం టెండెంట్ వేసిన విచారణ కమిటీ సభ్యులు సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్, ఎండోక్రైనాలజీ హెచ్‌వోడీ పి.శ్రీనివాసులు, ఇరు వురిని పిలిచి విచారణ చేశారు. అలాగే వివాదం జరిగిన సమయంలో ఆసుపత్రి ఆవరణలో ఉన్న శానిటేషన్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్లు, వర్కర్లు, పెస్ట్ కంట్రోల్ సిబ్బంది విచారణ చేసి వారి నుంచి రిటర్న్ స్టేట్‌మెంటు తీసుకున్నారు. స్టేట్‌మెంటు ఆధారంగా తిరిగి శనివారం విచారణ చేపడుతామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ముగిసిన ఇంటర్ మూల్యాంకనం

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 4: కర్నూలు ప్రభుత్వ టౌన్‌మోడల్ జూనియర్ కళాశాలలో మార్చి 18న ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం గురువారంతో ముగిసింది. కర్నూలు జిల్లాకు మొత్తం 2.31 లక్షల జవాబు పత్రాలు వచ్చాయి. సకాలంలో పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేసేందుకు సహ కరించిన అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువ య్యశెట్టి కృతజ్ఞతలు తెలిపారు. ఇంటర్ పరీక్ష ఫలితాలు ఈ నెల 2వ వారంలో విడుదల చేసేందుకు ఇంటర్ బోర్డు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

రెక్టార్‌ను పదవి నుంచి తొలగించాలి

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 4: ఆర్‌యూ రెక్టార్, ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్‌ను పదవి నుంచి తొలగించాలని భీమ్ ఆర్మీ రాష్ట్ర కన్వీనరు ఎస్.విజ యభాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్‌యూ రిజిస్ట్రార్ ఎన్.అంకన్నను వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపకుల పతి పదవి కోసం పోరాటి చివరకు రెక్టార్ స్థానం సంపాదించారన్నారు. వెంటనే ఆయన్ను పదవి నుంచి తొలగించాలని, లేనిపక్షంలో ఆయన చేసిన అవినీతి, అక్రమాలపై జిల్లా వ్యాప్తంగా పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేస్తామని హెచ్చరించారు.

వలంటీర్ల రాజీనామా వెనుక వైసీపీ కుట్ర

ఓర్వకల్లు, ఏప్రిల్ 4: వలంటీర్ల రాజీనామా వెనుక వైసీపీ కుట్ర ఉందని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి అన్నారు. గురువారం ఓర్వకల్లులో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇంటి వద్దకే పింఛన్ ఇవ్వాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ జగన్ రెడ్డి కుట్రతో సచివాలయాలు, పంచాయితీ కార్యాల యాల్లో పింఛన్లు ఇవ్వడం దారుణమన్నారు. వృద్ధులు ఎండల్లో తట్టుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వృద్ధులు, వికలాంగులకు ఇళ్ల వద్దనే పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వలంటీర్లతో జగన్ రెడ్డి మూకుమ్మడి రాజీనామాలు చేయిస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లకు రూ.50వేలు సంపాదించే మార్గం చంద్రబాబు చూపి స్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్లా బాబు, అబ్దుల్లా పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 4: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ విధుల్లో ఉండే ఉద్యోగులు ఫారం-12 ద్వారా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవా లని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ తెలిపారు. గురువారం పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డితో కలిసి పాతకౌన్సిల్ హాలులో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ భార్గవతేజ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. ఫారం-12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ కల్పించడానికి అన్ని ఏర్పాటు పూర్తి చేయాలని అధికారులను ఆదేశిం చారు. ఈసమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్, అడి షనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సెక్రటరీ నాగరాజు, ప్రత్యేక అధికా రులు, మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ బృందం పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థి ప్రతిభ

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 4: నేషనల్ ఏరోనాటికల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) 2024 ఏడాదికి జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్‌కే సెటిల్మెంట్ పోటీలలో స్థానిక యేలూకూరు బంగ్లా నారాయణ పాఠశాల విద్యార్థిని ఎం.వరుణ్య ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు పాఠశాల ఏజీఎం రమేష్ కుమార్ తెలిపారు. గురువారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి విద్యార్థిని ఎం.వరుణ్యను అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ అన్వర్ బాషా, కోఆర్డినేటర్ శ్రీహరి, డీన్ సతీష్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

'వడదెబ్బ తగలకుండా జాగ్రత్త వహించండి'


విద్యార్థులకు సూచనలిస్తున్న వైద్యాధికారి

కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 4: ఎండలు తీవ్రంగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కో-లోకేటెడ్ వైద్యాధికారి మదనశేఖర్ తెలిపారు. గురువారం కస్తూర్బా గురుకుల బాలికల విద్యాలయంలో వడదెబ్బపై తీసుకోవాలని చర్యలపై అవగాహన కల్పించారు. వైద్యా ధికారి మాట్లాడుతూ ఉదయం సమయాల్లో పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సివస్తే టోపి లేదా రుమాలు ధరించాలని అన్నారు. అలసట, వికారం, వాంతులు శ్వాస తీసుకో వడంలో ఇబ్బందులు, నోరు, కళ్లు పొడిబారడం వంటి లక్షణాలు ఉంటే వైద్యు డిని సంప్రదించాలని సూచించారు. మజ్జిగ, మంచినీరు, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణం ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కమాల్‌సాహెబ్, నసీమా బేగం, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


డీఎంహెచ్‌వోను కలిసిన ఏపీజీఈఏ జిల్ల అధ్యక్షుడు బంగి శ్రీధర్

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 4: వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్ కోరారు. ఈ మేరకు డీఎం హెచ్‌వో డా.వై.ప్రవీణ్ కుమా ర్‌ను గురువారం సాయంత్రం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏపీజీ ఈఏ నేతలు కలిశారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో గత 6 నెలలలుగా బాధపడుతున్న పెద్దకడుబూరు పీహెచ్‌సీలో పని చేస్తున్న పీహెచ్ఎన్ ఏ.లక్ష్మి దేవి స్వచ్ఛంద పదవీ విరమణను ఆమోదింపజేయాలని, ఆ దరఖాస్తును కడప ఆర్డీకి పంపించాలని బంగి శ్రీధర్ డీఎంహెచ్‌వోను కోరారు. దీనిపై స్పందించిన డీఎంహెచ్‌వో ఆ ఫైల్‌ను తెప్పించి ఆర్‌డీకి పంపించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సురేష్ రెడడ్డి, కర్నూలు నగర అధ్యక్షులు మురళిధర్ నాయుడు, సంఘం వైద్యఆరోగ్యశాఖ నాయకులు చిన్నయ్య, నరసప్ప, చంద్రశేఖర్, సంపత్ పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 4: ఎమ్మిగనూరు మండలంలోని కడిమెట్ల గ్రామంలో స్థలం విషయంలో చోటు చేసుకున్న ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ కేశన్నతో పాటు వెంకటేష్, మద్దిలేటి, శేఖర్‌లతో పాటు రామకృష్ణ, బీసన్న, మహేష్, పరశురాములపై కేసు నమోదు చేశామని అన్నారు.

రెండురోజులకు ఒక్కసారి తాగునీరు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 4: నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డులలో రెండో వారం నుంచి రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా చేయనున్నట్లు కమిషనర్ ఎ.భార్గవతేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం అతి తక్కువ వర్షపాతం నమోదు కావడంతో సుంకేసుల రిజర్వా యర్‌లో నీటి మట్టం అడుగంటిపోయిందన్నారు. ప్రస్తుతం 70 కిలోమీటర్ల దూరంలోని గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి తాగునీటిని కేసీసీ కెనాల్ ద్వారా తీసుకువస్తామన్నారు. ప్రతిరోజు నీరు అందించేందుకు ఇబ్బందిగా ఉండటం తో రోజు విడిచి రోజుసరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నగర ప్రజలు తాగునీటిని పొదుపు వాడుకుని మున్సిపల్ సిబ్బందికి సహకరిం చాలని విజ్ఞప్తి చేశారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

సి.బెళగల్, ఏప్రిల్ 4: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపీటీసీ ఈరన్నగౌడు అన్నారు. గురువారం మండల కేంద్రంలో టీడీపీ నాయకుడు మల్లికార్జునగౌడు అధ్యక్షతన బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఈరన్నగౌడు మాట్లాడుతూ టీడీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికులా పనిచేయాలన్నారు. అనంతరం మండలంలోని కొటారుమిట్ట, కోట వీధి, ఎస్సీకా లనీల్లో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గోపాల్‌గౌడు, సోమనాథ్‌గౌడు, మాజీ ఎంపీటీసీలు ధనుం జయుడు, రంగన్న, బాలాజీ వెంకటేశ్వర్లు, నల్లన్నతాత, గౌస్‌బాషా, నాగరత్నం, బాషా, విష్ణు హమాలీ యూనియన్ నాయకుడు భీమన్న పాల్గొన్నారు.


రంజాన్ తోఫా కిట్ల పంపిణీ


రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 4: కర్నూలు నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లోని గురుదత్త పాలిక్లినిక్‌లో గురువారం నిరుపేద ముస్లిం మహిళలకు సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.శంకర్‌శర్మ రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో ఎంతో కొంత భాగాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. రంజాన్ సందర్భంగా పేదముస్లిం కుటుంబాలు సంతోషంగా పండుగ జరుపుకోవాలన్న ఉద్దేశంతో తన వంతు బాధ్యతగా కిట్లను పంపిణీ చేశామన్నారు.

హుశేనాపురం హైవేపై వెలగని లైట్లు

భయాందోళనలో ప్రయాణికులు


హుశేనాపురంలో హైవేపై వెలగని ఎల్ఈడీ లైట్లు

ఓర్వకల్లు, ఏప్రిల్ 4: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై హుశేనా పురం, కాల్వబుగ్గ, సోమయాజులపల్లె బస్టాండు సమీపాల్లో రోడ్డుకి ఇరువైపు లా వేసిన ఎల్ఈడీ లైట్లు వెలగకపోవడంతో బస్టాండులో అంధకారం నెలకొంది. దీంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. లైట్లను రాత్రివేళల్లో వేస్తున్నారని ఈవిషయంపై టోల్ ప్లాజా యజమాన్యానికి విన్నవిం చినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత టోల్‌ప్లాజా యజమాన్యం స్పందించి ప్రతిరోజు ఎల్ఈడీ బల్బులు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

గూడూరు, ఏప్రిల్ 4: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు అన్నారు. గురువారం గూడూరులోని ఐదో వార్డులో రామాంజనేయులు ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ నరసింహులు, టీడీపీ యువ నాయకుడు వీర కుమార్, సీనియర్ టీడీపీ నాయకుడు నాగప్ప యాదవ్ ఇంటింటికి వెళ్ళి బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కింద సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కోడుమూరు నియోజక వర్గంలో టీడీపీ జెండా ఎగుర వేసి చంద్రబాబుకు కానుకగా ఇద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్లతో చిన్నారులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 4: నగరంలోని సంసిద్ పాఠశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మహబూబ్ ఆలీఖాన్, కీర్తి మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే విద్యకు ప్రాముఖ్యతను తెలుసుకుని సాధన చేస్తే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

నీళ్లు లేక రజకుల అవస్థలు


అరకొరగా ఉన్న నీటిలోనే దుస్తులు ఉతుకుతున్న రజకులు

సి.బెళగల్, ఏప్రిల్ 4: మండలం లోని బ్యాధోలి, మారందొడ్డి, క్రిష్ణదొడ్డి, పలుకుదొడ్డి గ్రామాలలో నీళ్ల లేక పోవడంతో రజకులు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామాలలో నీటి కుంటలకు నీరు వదలాలని అధికారులకు, గ్రామాల సర్పంచులకు పలు మార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేదు. దీంతో మండలంలోని గ్రామాల రజకులు సమీపంలో వ్యవసాయ బావుల రైతులను వేడుకుని బురదకుంటలోనికి నీరు వదులుకుని బట్టలు ఉతుకుతున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఆయా గ్రామాల కుంటలకు నీరు వదిలేలా చర్యలు తీసుకోవాలని మొర్రెమ్మ, లక్ష్మి, రాముడు కోరుతున్నారు.

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

చలో గుంటూరును జయప్రదం చేయండి

కోసిగి, ఏప్రిల్ 4: గుంటూరులో ఈ నెల 8వ తేదీన జరగనున్న హలో మాదిగ.. చలో గుంటూరు మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్పీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు సుభాష్ చంద్ర పిలుపునిచ్చారు. గురువారం కోసిగిలోని దుర్గానగర్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎన్డీయే కూటమికి మద్దతు ఇవ్వాలని మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నాగప్ప, హనుమంతు, దుర్గప్ప, నాగరాజు, గిడ్డయ్య, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 4: ఎమ్మిగనూరు మండలంలోని కడిమెట్ల గ్రామంలో స్థలం విషయంలో చోటు చేసుకున్న ఘర్షణలో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ కేశన్నతో పాటు వెంకటేష్, మద్దిలేటి, శేఖర్‌లతో పాటు రామకృష్ణ, బీసన్న, మహేష్, పరశురాములపై కేసు నమోదు చేశామని అన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపుతాం



మాదిగ సింహగర్జన పోస్టర్లను విడుదల చేస్తున్న జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు

మంత్రాలయం, ఏప్రిల్ 4: మాదిగలకు న్యాయం చేస్తామని ఎన్నికల ముందు చెప్పి మోసం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపుతామని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కిం జానయ్య అన్నారు. గురువారం మంత్రాలయం మండలంలోని తిమ్మాపురం, వగరూరు, చిలకలడోన తదితర గ్రామాల్లో పర్యటించి కర్నూలులో జరిగే మాదిగల సింహగర్జన పోస్టర్లను విడుదల చేశారు. ఏపీలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. సమావేశంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు హనుమంతప్ప, రత్నం, ప్రకాష్, విజయకుమార్, సుందర్‌రాజు, ఆశీర్వాదం, భూపతి, జోసెఫ్, జీవరత్నం, యువరాజు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు చేయూతనందిస్తాం

మంత్రాలయం, ఏప్రిల్ 4: మంత్రాలయం జర్నలిస్టులకు రాఘవేంద్రస్వామి మఠం తరఫున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. గురువారం ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఆదేశాల మేరకు వేసవి కాలం దృష్ట్యా వార్తలు సేకరణలో ఎండ నుంచి రక్షణ పొందేందుకు అవసరమైన టోపీలను ఏపీయుడబ్ల్యూజే తాలుకా అధ్యక్షులు జయరాజు, ప్రధాన కార్యదర్శి హుశేని, జిల్లా ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా, కోశాధికారి సాబువలి ఆధ్వర్యంలో పీఠాధిపతి చేతుల మీదుగా అందజేశారు. నియోజకవర్గంలోని కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం, మంత్రాలయం మండలంలోని 120 మంది జర్నలిస్టులకు టోపీలను అందజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు

మంత్రాలయం, ఏప్రిల్ 4: మంత్రాలయం మండలంలోని పాతరాంపురం వద్ద కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భార్గవ రెడ్డి తెలిపారు. బుధవారం కర్నాటక నుంచి 480 అక్రమ మద్యం టెట్రా ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విక్సీ బాటిళ్లను తెస్తుండగా.. కోసిగి మండలంలోని చిన్న భూంపల్లి గ్రామానికి చెందిన రాజోలి వెంకటేశ్‌ను గురువారం అరెస్టు చేసినట్లు తెలిపారు. అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని రాజోలి వెంకటేశ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా.. ఆదోని సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ సత్యనారాయణ, నరసింహారెడ్డి, భరత్, లక్ష్మన్న పాల్గొన్నారు. కర్ణాటక మద్యం అమ్మినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మిగనూరు: మంత్రాలయం మండలంలోని పాతరాంపురం దగ్గర అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ సీఐ భార్గవరెడ్డి ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. గురువారం సీఐ తెలిపిన వివరాల మేరకు కోసిగి మండలం చిన్నభూంపల్లి గ్రామానికి చెందిన రాజోలి వెంకటేష్ అనే వ్యక్తి కర్ణాటక నుంచి పాతరాంపురం మీదుగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడిచేసి పట్టుకున్నామన్నారు. నిందితుడి నుంచి 5 బాక్సుల్లో ఉన్న 480 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.30 వేలు ఉంటుందన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

90 శాతం పూర్తయిన పింఛన్ల పంపిణీ

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 4: ఎమ్మిగనూరు మండలంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పంపిణీ చేసే పింఛన్లు 90శాతం పూర్తయినట్లు ఎంపీడీవో కొండన్న తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ వలంటీర్లతో పింఛన్ పంపిణీ చేయరాదని ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. దీంతో సచివాలయ సిబ్బంది, కార్యదర్శులతో పింఛన్లను పంపిణీ చేయించామని అన్నారు. సచివాలయాలకు దూరంగా ఉన్న మజరా గ్రామాలకు వెళ్లి పింఛన్లు అందజేసినట్లు తెలిపారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 4: గ్రామంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో ప్రజలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదన్నారు.

వైసీపీని ఇంటికి పంపిద్దాం

మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి



సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న టీడీపీ అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి

కౌతాళం, ఏప్రిల్ 4: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని ప్రజలు ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలో గురువారం రెండో రోజు టీడీపీ ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు ఉలిగయ్యతో కలసి రాఘవేంద్రరెడ్డి గ్రామంలోని ఎస్సీకాలనీ, శివప్పనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారన్నారు. సొంత బాబాయిని హత్య చేసిన నిందితులను పట్టుకోని ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని ఏమి కాపాడుతాడని అన్నారు. నియోజకవర్గంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలనాగిరెడ్డి ప్రజలకు ఏమి చేశారని, తాను ఇసుక దోపిడీ చేసి కోట్లకు పడగలెత్తారన్నారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సురేష్‌నాయుడు, సతీష్ నాయుడు, జనసేనా నాయకుడు రామాంజనేయులు, బీజేపీ నాయకుడు ఈరన్న, నాయకులు నీలకంఠరెడ్డి, కురువ వీరేష్, కృష్ణకాంత్, శ్రీరాములు పాల్గొన్నారు.

వైద్యం వికటించి పసికందు మృతి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 4: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం వికటించి రెండు నెలల పసికందు మృతి చెందింది. అయితే పసికందు మృతికి వైదుల నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తూ ఆసుపత్రి నిర్వాహకులతో ఘర్షణకు దిగారు. వెంకటాపురం కాలనీకి చెందిన దంపతులకు రెండు నెలల క్రితం ఆడబిడ్డ జన్మించింది. నాలుగు రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. బుధవారం పరిస్థితి ఆందోళన కరంగా ఉందని కర్నూలుకు తరలించాలని వైద్యులు చెప్పడంతో ఇంతలోనే పసికందు మృతి చెందింది. దీంతో ఆగ్రహానికి గురైన తల్లిదండ్రులు, బంధువులు ఆసుపత్రి నిర్వాహకులను నిలదీయడంతో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. కాగా అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు రంగ ప్రవేశం చేసి పసికందు మృతి వివాదం కాకుండా చక్కబెట్టినట్లు తెలిసింది.

ఏడీగా బాధ్యతల స్వీకరణ

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 4: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత ఏడాది అక్టోబరు 11న ఏడీని అధికారులు సరెండర్ చేశారు. ఆ తర్వాత ఆయన కోర్టుకు వెళ్లారు. ఇంతలో 3 నెలలు సెలవులో వెళ్లారు.. తిరిగి మళ్లీ బాధ్యతలు చేపట్టారు.

అతివేగం.. ప్రమాదకరం..



మాట్లాడుతున్న సీఐ

మద్దికెర, ఏప్రిల్ 4: అతివేగం ప్రమాదకరమని, ప్రతి ఒక్కరూ ప్రయాణాలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం మద్దికెరలోని మెయిన్‌బజారులో రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు జీవనోపాధి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్తుంటారని, అయితే.. వీరు ప్రయాణిస్తున్న వాహనాల్లో ఎక్కువ మంది వెళ్లడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. మార్చి 31న ఒకే వాహనంలో దాదాపు 40 మంది ప్రయాణించడం వల్ల ప్రమాదం జరిగి నలుగురి ప్రాణాలు కోల్పోయారన్నారు. పరిమితికి మించి వాహనాల్లో ఎక్కకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్‌బాబు, పోలీసులు ఉన్నారు.

ఎంఎల్వోలపై చర్యలు తీసుకోవాలి: టీడీపీ

నందవరం, ఏప్రిల్ 4: మండలంలోని ఎంఎల్వోలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు, ప్రచార కార్యదర్శి దామా నరసింహులు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ మండల లెవల్, వలంటీర్లకు హెడ్ బాబులాల్ ప్రభుత్వం నుండి జీతం తీసుకుని ఎన్నికల కమిషన్ ఆదేశాలను లెక్క చేయకుండా మన సంకల్పం యాత్రలో వైసీపీ తరఫున ప్రచారం చేస్తున్నారని సాక్షులతో సహా ఎన్నికల అధికారి చిరంజీవికి ఫిర్యాదు చేశారని అన్నారు. అయినా చర్యలు తీసుకోలేదని అన్నారు. వెంటనే కేసు నమోదు చేయాలని అన్నారు.

'మీ ఇష్టం ఏమైనా చేసుకోండి'



తారాపురంలో ఎమ్మెల్యే ఎనికల ప్రచారంలో ప్రదీప్‌రెడ్డితో మాట్లాడుతున్న వలంటీర్ బ్రహ్మయ్య

పెద్దకడుబూరు , ఏప్రిల్ 4: ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనరాదని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయినా గ్రామ వలంటీర్లు బేఖాతర్ చేస్తున్నారు. మీకు ఇష్టం వచ్చింది చేసుకోండి.. మేము మాత్రం ఎవరి ఆదేశాలను లెక్కచేయమంటూ ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటున్నారు. గురువారం మండల పరిధిలోని తారాపురం గ్రామంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బాలనాగిరెడ్డి చేస్తున్న ప్రచారంలో గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు. ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోరా? అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.




వలంటీర్ మహబూబ్‌బాషా

ఇంటి దగ్గరే పింఛన్లు ఇవ్వాలి

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 4: వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఇంటి వద్దనే పింఛన్లు ఇవ్వాలని బీజేపీ కిసాన్ మోర్చా అసెంబ్లీ ఇన్‌చార్జి సీసీ రంగన్న డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ అధికారులకు బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి వద్దకే వెళ్లి పించన్లు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ పత్తికొండ సచివాలయ సిబ్బంది కలెక్టర్ ఆదేశాలను పాటించడం లేదన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది పింఛన్‌దారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పెండింగ్ కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాలి

● న్యాయాధికారి దివ్య



మాట్లాడుతున్న న్యాయాధికారి దివ్య

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 4: పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి దివ్య అన్నారు. గురువారం స్థానిక సివిల్ కోర్టు ఆవరణలో న్యాయవాదులతో ఆమె సమావేశమై మాట్లాడుతూ పెండింగ్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే వృథా కాదని అన్నారు. పత్తికొండ కోర్టులో సుమారు 3వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, మే 11న జరిగే జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో ఆస్తితగాదాలు, ప్రోనోట్, చెక్‌బౌన్స్ ఇతర పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసుల్లో రాజీ అయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్యూరిటీ మహేష్, ట్రెజరర్ రాజశేఖర్ నాయుడు, జాయింట్ సెక్రటరీ వాసుదేవనాయుడు, సీనియర్ న్యాయవాదులు గోపాల్ రెడ్డి, వీరన్న, ఎల్లారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



కలశాన్ని ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

తుగ్గలి, ఏప్రిల్ 4: మండల పరిధిలోని రోళ్లపాడు తండాలో మారెమ్మవ్వ నూతన దేవాలయం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ట వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. గురువారం గ్రామానికి చెందిన అమర్నాథ్ రెడ్డి తన సొంత నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన మారెమ్మవ్వ దేవాలయం, విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను వేద పండితులు నిర్వహించారు. అలాగే నాగప్రతిమలు, బొడ్రాయిని ఏర్పాటు చేశారు.

మంత్రాలయం ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి

పెద్దకడుబూరు, ఏప్రిల్ 4: మంత్రాలయం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే సీటును తనకు కేటాయించాలని కంబదహాల్ గోవర్ధన్‌రెడ్డి కోరారు. గురువారం ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షర్మిల తనకు టికెట్ ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించారని అన్నారు. షర్మిలను కలిసిన వారిలో కాంతారెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మీరెడ్డి, సత్తిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

జగన్ ఓటమే.. కూటమి లక్ష్యం

మద్దికెర, ఏప్రిల్ 4: రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తున్న సీఎం జగన్‌ను గద్దె దించడమే కూటమి లక్ష్యమని.. పత్తికొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం మండలంలోని మదనంతపురం గ్రామంలో కేఈ శ్యాంబాబుకు టీడీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం చేశారన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీని సర్వనాశనం చేశారని ఆరోపించారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబుతోనే యువతకు భరోసా ఉంటుందన్నారు. సీఎం జగన్ పాలనలో యువత భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. మెగా డీఎస్సీ లేక జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని నిరుద్యోగ యువతకు హామీ ఇచ్చి సీఎం జగన్ మోసం చేశారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ సభ్యులు డి. పురుషోత్తం చౌదరి, సర్పంచ్ బొమ్మనపల్లి ఆంజనేయ, అశోక్ కుమార్, టీడీపీ నాయకులు మదనంతపురం సంజప్ప, శ్రీనివాసులు, హరినాథ్‌గౌడు, మండల సీపీఐ సహాయ కార్యదర్శి గుంత హనుమన్న, గుంత రాముడు, లింగమయ్య, గోవిందు, మల్లయ్య, మండల సీపీఐ మాజీ కార్యదర్శి పాపన్న తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏ భవనం జోలికి వస్తే ఉద్యమిస్తాం

మద్దికెర, ఏప్రిల్ 4: మద్దికెర గ్రామంలోని వీఆర్ఏల విశ్రాంతి సమావేశ భవనాన్ని కూల్చివేయాలని చూస్తున్నారని, దాని జోలికి వస్తే.. ఉద్యమిస్తామని సీపీఐ మండల కార్యదర్శి కడవల రవికుమార్ హెచ్చరించారు. గురువారం తహసీల్దార్ రజాక్‌వలికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్ల కిందట వీఆర్ఏలు సమావేశం అయ్యేందుకు చందాలు పోగు చేసి భవనాన్ని నిర్మించుకుంటే.. ఇప్పుడు ఆ భవనాన్ని కూల్చి మార్కెట్ కట్టాలని చూస్తున్నారని అన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

మద్దికెర, ఏప్రిల్ 4: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మండలంలోని ఓటర్లంతా నిర్భయంగా, స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ రజాక్‌వలి తెలిపారు. గురువారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లంతా బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రంగస్వామి తదితరులు ఉన్నారు.

అసత్య ఆరోపణలు సరికాదు: ఎంపీపీ కేశన్న

ఎమ్మిగనూరుటౌన్, ఏప్రిల్ 4: తనకు సంబంధం లేని విషయాల్లో అసత్య ఆరోపణలు చేయటం బాధాకరమని ఎంపీపీ కేశన్న అన్నారు. గురువారం ఆయన ఎమ్మిగనూరులో విలేఖరులతో మాట్లాడుతూ తమ గ్రామం కడిమెట్లలో పరశురాం అనే వ్యక్తితో తన బంధువులకు జరిగిన ఘర్షణలో తన ప్రమేయం లేదని అన్నారు. దీన్ని స్థలం వివాదంగా సృష్టించి తాను దాడికి పాల్పడ్డారని పత్రికల ద్వారా ప్రచారం చేయడం దారుణమన్నారు. తాను ఎంపీపీగా ప్రజలకు సేవలు అందించటమే గాని, ఎవరి భూములు ఆక్రమించుకోలేదని అన్నారు.

ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ల పంపిణీ



వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

మద్దికెర, ఏప్రిల్ 4: మద్దికెర గ్రామంలో సచివాలయ ఉద్యోగులు ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. గురువారం మద్దికెర గ్రామంలోని నాలుగు సచివాలయాల సిబ్బంది ఇళ్లకు వద్దకు వెళ్లి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం మధ్యాహ్నానికి పింఛన్ల పంపిణీ ప్రక్రియ 92 శాతం పూర్తి చేశారు.

ఆలూరులో టీడీపీ జెండా ఎగరవేస్తాం

ఆస్పరి, ఏప్రిల్ 4: సార్వత్రిక ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరవేస్తామని ఆలూరు పార్టీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని బైలుపత్తికొండ, బనవనూరు గ్రామాల్లో ఓ కార్యక్రమానికి వీరభద్రగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గడిచిన 5 ఏళ్లలో చేపట్టిన ప్రజావ్యతిరేక విధానాలతో రాష్ట్ర ప్రజలు విసిగి చెందారని, రానున్న ఎన్నికల్లో వారికి బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కప్పట్రాళ్ల బుజ్జమ్మ, మాజీ ఎంపీపీ కృష్ణయాదవ్, మాజీ మండల కార్యదర్శి మోహన్ ప్రసాద్, సంజన, సుదర్శన్ యాదవ్, శేశిరెడ్డి, ఈరన్న ఆచారి, రాఘవేంద్ర, రాజశేఖర్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఆలూరు, ఏప్రిల్ 4: ఆలూరు మెయిన్ బజార్‌లో రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి రామ్మూర్తి బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు మండిపో తుండటంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు గురికాకుండా ఉండేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన

ఆదోని టౌన్, ఏప్రిల్ 4: స్థానిక మైనారిటీ నాయకుడు జాఫర్ రహీం గురువా రం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గ బాధ్యుడు నీలకంఠప్ప, డీసీసీ ఉపాధ్యక్షుడు దిలీప్ ధోకా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ రావు, జాఫర్ రహీంకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్ర మంలో నాయకులు జయరాం, మణిక్యరాజ్, సుంకన్న, ఫరూక్, నిసార్, గొల్ల మోహన్, రామన్న యాదవ్ పాల్గొన్నారు.

రేపు పాపమాంబ ఆరాధనోత్సవాలు

ఆదోని టౌన్, ఏప్రిల్ 4: పట్టణంలోని మరాఠీవాడి ప్రాంతంలో వెలసిన పాపమ్మ సద్గురు సర్కార్ స్వామివారి ధ్యానమందిర మఠంలో శనివారం 68వ పాపమాంబ అమ్మవారి ఆరాధనోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎల్లమ్మ మాన్కార్ రమేష్ ఫ్యామిలీ ట్రస్ట్ వారు గురువారం తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకం, పూలార్చనలతో ఉత్సవాలు ప్రారంభమై, సాయంత్రం వీధులలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగి స్తామని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.

60 శాతం సీట్లు కేటాయించడం అభినందనీయం

ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 4: సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయపార్టీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సామాజికవర్గాలకు 60 శాతం సీట్లు కేటాయించడం అభినందనీయమని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు అన్నా రు. గురువారం బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం లో ఆయన మాట్లాడారు. ఈసమావేశంలో నాయకులు దేవేంద్ర, రమేష్ ఆచారి, మరియాని చెన్నబసప్ప, షేక్షావలి, శేషన్న, రంగస్వామి, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు శిక్షణ

ఆలూరు, ఏప్రిల్ 4: వచ్చే నెల 24న జరిగే పాలిసెట్-2024 ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆలూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి బుధవారం తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 1వ తేదీ నుంచే శిక్షణ ప్రారంభమైదని, ఉచితంగా మెటీరియల్ కూడా అందిస్తున్నట్లు తెలిపారు.

అరికేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవం



అరికేరేశ్వర స్వామి విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్థులు

ఆలూరు, ఏప్రిల్ 4: మండలంలోని అరికెర తండా గ్రామంలో బుధవారం అరికేశ్వర స్వామి ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. ఆలయంలో హోమం, గంగిపూజ, పంచా మృతాభిషేకం, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు.

రమణీయంగా రాఘవేంద్రుడికి స్వర్ణ పల్లకి సేవ



స్వర్ణపల్లకిలో ఊరేగుతున్న రాఘవేంద్రుడు

మంత్రాలయం, ఏప్రిల్ 4: మంత్రాలయంలో గురువారం రాఘవేంద్రుడి స్వర్ణ పల్లకి సేవ రమణీయంగా నిర్వహించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్టించి రమణీయంగా ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది.

పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ పని చేయాలి



మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు

పత్తికొండ, ఏప్రిల్ 4: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త పూర్తి స్థాయిలో పని చేయాలని టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం పత్తికొండ సమీపంలో ఊరువాకిలి సమీపంలో నూతన టీడీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనను ప్రజలకు వివరించడంతో పాటు టీడీపీ సూపర్‌సిక్స్ మేనిఫెస్టోను ప్రజలకు తెలియజేస్తూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు క్షేత్రస్థాయిలో కార్యకర్తలు పని చేయాలన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులతో దివాలా తీసిందని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే తప్ప.. రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తిన వెంకట్రాముడు, తుగ్గలి నాగేంద్ర, మనోహర్ చౌదరి, తిమ్మయ్య చౌదరి కడవల సుధాకర్,జనసేన ఇన్‌చార్జి రాజశేఖర్, టీడీపీ నాయకులు పూన మల్లికార్జున గోరంట్లతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ ఆగడాలను అరికట్టండి

కోసిగి, ఏప్రిల్ 4: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని టీడీపీ యువ నాయకులు రామక్రిష్ణారెడ్డి, ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి అన్నారు. గురువారం కోసిగి మండల పరిధిలోని జంపాపురం గ్రామంలో మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, మాజీ జడ్పీటీసీ తోవి రామక్రిష్ణ, మాజీ సర్పంచ్ బసప్ప, మాజీ ఎంపీటీసీ చిదానంద, బసవరాజు, చాగి ఈరన్న, చంద్రయ్య, హనుమప్ప, నర్సన్న, సొట్టయ్య, వీరేష్ పాల్గొన్నారు.